క్లుప్తంగా

22న ప్రొద్దుటూరులో యువ ఉత్సవ్

కడప స్పోర్ట్స్: ప్రొద్దుటూరు పట్టణంలోని సీబీఐటీ కళాశాలలో ఈనెల 22న భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి 'యువ ఉత్సవ్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కె. మణికంఠ తెలిపారు. ఈ యువ ఉత్సవ్ కార్యక్రమంలో 'పంచ్ ప్రాణ్ ఆఫ్ అమ్రిత్ కాల్' అన్న అంశంపై పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాల్లో వ్యక్తిగత, గ్రూప్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

'బ్రౌన్'కు పుస్తకాల బహూకరణ



పుస్తకాలను అందజేస్తున్న డాక్టర్ నరాల రామారెడ్డి

కడప కల్చరల్ : ప్రముఖ అవధాని, కవి డాక్టర్ నరాల రామారెడ్డి కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి వెయ్యి పుస్తకాలను అందజేశారు. ప్రొద్దుటూరులోని తన స్వగృహంలోగల వ్యక్తిగత గ్రంథాలయానికి చెందిన ఈ పుస్తకాలను సోమవారం ఆయన స్థానిక ప్రముఖులు గజ్జెల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, గ్రంథ పాలకులు జి.హరిభూషణరావులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కవిగా, అవధానిగా సుప్రసిద్ధులైన నరాల రామారెడ్డి వ్యక్తిగత గ్రంథాలయమంతా అత్యంత విలువైన సాహిత్య గ్రంథాలు ఉండడం సహజమని, వాటి నుంచి వెయ్యి పుస్తకాలను అందజేయడంతో బ్రౌన్ కేంద్రం విలువ మరింత పెరుగుతుందని కొనియాడారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తపాలా ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : తపాలా శాఖలోని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ కడప డివిజన్ కార్యదర్శి సలాం పేర్కొన్నారు. సోమవారం తపాలాశాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ కడప ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాదిగా పోస్టుమెన్ ఖాళీలు, సెలవుపై వెళ్లిన వారి స్థానంలో తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. దీనివల్ల మిగిలిన మహిళా పోస్టుమెన్లపై అదనపు భారం పడుతోందని, తద్వారా ప్రజా సేవలలో తీవ్ర జాప్యం కలుగుతోందన్నారు. యూనియన్ నాయకులు గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

19న చలో కలెక్టరేట్

కడప వైఎస్‌ఆర్‌సర్కిల్ : ఏపీ చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న చలో కలెక్టరేట్‌ను చేపట్టనున్నట్లు ఏపీ చేనేత ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు మల్లికార్జున, ఓబయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని తెలిపారు. కార్మికులకు రావాల్సిన 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఏపీ చేనేత ఐక్యకార్యచరణ కమిటీ నాయకులు వీరనాల శివనారాయణ, రామదాసు, గోవిందరాజులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

– నెహ్రూ యువకేంద్రం అధికారి మణికంఠ



ర్యాలీ నిర్వహిస్తున్న నెహ్రూ యువకేంద్రం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ సూచించారు. సోమవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యూత్ హాస్టల్ నుంచి బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయసులో పని చేయడం, పనిలో పెట్టుకోవడం రెండు సరికాదన్నారు. యోగా శిక్షకుడు ప్రసాద్, నాగజ్యోతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా..జగనన్న విద్యాకానుక



గాంధీనగర్ స్కూల్ ఆవరణలో జరిగిన విద్యా కానుక కిట్ల పంపిణీకి హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

కడప ఎడ్యుకేషన్: జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ సోమవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి విద్యా కానుక కిట్లను అందజేశారు.

- నగరంలోని గాంధీనగర్ స్కూల్ ఆవరణలో జరిగిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో డిప్యూటీ సీఎం అంజద్ బాషా, కలెక్టర్ విజయరామరాజు, మేయర్ సురేష్ బాబు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి, కమిషనర్ ప్రవీణ్ చంద్ తదితరులు హాజరై విద్యా కానుక అందజేశారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.
- అలంఖాన్‌పల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ ఉమ, హెచ్‌ఎం మునిరత్నమ్మ, విద్యా కార్యదర్శి రవీంద్ర, విద్యాకమిటీ బృందం చేతుల మీదుగా అందచేశారు.
- కడప వక్కలపేట ఉర్దూ స్కూల్లో 38వ డివిజన్ కార్పొరేటర్ వాణి, బసవరాజు విద్యాకానుకను అందచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నజీబ్ తదితరులు పాల్గొన్నారు.
- విద్యార్థులు తొలిరోజు ఉత్సాహంగా స్కూళ్లకు హాజరయ్యారు. ఇక పాఠశాలల్లో తీసుకున్న కిట్లను చూసి మురిసిపోయారు.



విద్యాకానుక కిట్ల పంపిణీ ప్రారంభోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సీఎం తదితరులు



వక్కలపేట ఉర్దూ స్కూల్లో విద్యాకానుక అందచేస్తున్న కార్పొరేటర్ వాణి



కడప అలంఖాన్‌పల్లె జెడ్పీ హైస్కూల్లో విద్యాకానుక అందచేస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి



జగనన్న విద్యాకానుక కిట్లతో ఆనందంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి



'స్పందన' కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన'కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 14 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి-4, టౌన్‌ప్లానింగ్-3, రెవెన్యూ విభాగం-1, యూపీఏ విభాగం-1, హౌసింగ్-2, కడప తహసీల్దార్-1, సీకే దిన్నె తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి -2 అర్జీలు వచ్చాయి. వీటిని సత్వరమే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

హోర్డింగ్‌లపై చలానా రుసుము ముద్రించాలి

కడప నగరంలో ఏర్పాటు చేసే హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలపై నగరపాలక సంస్థ వారిచే జారీ చేయబడిన చలానా రుసుము తప్పనిసరిగా ముద్రించాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం హోర్డింగ్‌ల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ నిబంధనలు పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్లు అందుకున్న డ్రైవర్లతో ఆర్టీసీ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో కడప పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామాల్లోని లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు ఆర్టీసీ ద్వారా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం తమ కార్యాలయంలో 15వ బ్యాచ్ శిక్షణను పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 15 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకుని 16వ బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని.. ఒక్కొక్క బ్యాచ్‌కు 16 మంది మాత్రమే డ్రైవింగ్ స్కూలులో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 30 ఏళ్ల అనుభవం కలిగిన రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ చేత థియరీ క్లాసులు, ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తున్నామని వివరించారు. ప్రతిరోజు ఒక గంట అభ్యర్థికి వాహనం విడిభాగాలు, వాటి పనితీరు గురించి రోడ్లు, రోడ్లపై ఉండే పెయింటింగ్ మార్కుల గురించి, అలాగే రోడ్ల పక్కన ఉండే సైన్ బోర్డుల గురించి, అలాగే సిగ్నల్స్ బోర్డుల గురించి శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 99592 25774 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జబ్బార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి ప్రదీప్‌కుమార్, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ లక్ష్మీదేవి, ఉప కార్మికశాఖ కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం కడప ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు నుంచి కోటిరెడ్డిసర్కిల్ వరకు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దామని పిలుపునిచ్చారు. బాలలందరినీ బడికి పంపించి బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. స్వచ్ఛంద సంస్థలతోపాటు అన్నిశాఖల అధికారులు ఈ వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. అందరూ తమ పిల్లలను చదివించాలని, తమ పరిధిలో ఎక్కడైనా బాల కార్మికులు కనబడితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు సునంద, రమాదేవి, జిల్లా ప్రొబెషన్ అధికారి చెన్నారెడ్డి, లీగల్ కమ్ ప్రొబెషన్ ఆఫీసర్ సునీతరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.రెడ్డెమ్మ, బి.పద్మజ, కె.దీప, బి.రేణుకాదేవి, బి.నాగరత్నమ్మ, డి.మాబుచాన్, ఎస్.రేణుక, శ్రీవిద్య పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఓఎస్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్స్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



కడప శ్రీ హాస్పిటల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి సోమవారం కడప నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డ్స్‌లను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్‌ఫర్‌మేషన్ ఫ్లాట్ఫామ్ వెబ్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. కమ్యూనికేబుల్ డిసీజెస్‌కు సంబంధించిన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, కామెర్లు చికెన్ గున్యా, టీబీ, తదితర అంటు వ్యాధుల వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. అంటు వ్యాధులకు చెందిన వారు ఆసుపత్రులకు వచ్చినప్పుడు వారి వ్యాధి, చికిత్స వివరాలను రికార్డ్స్‌లో ఎంటర్ చేసి వెబ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డెమో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో యునాని వైద్యశాలలు స్థాపించాలి

– డిప్యూటీ సీఎంకు వినతి



యునాని వైద్య కళాశాల విషయమై డిప్యూటీ సీఎంతో చర్చిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో కోస్తాంధ్ర ప్రాంతానికి విజయవాడలో, రాయలసీమ ప్రాంతానికి కడపలో యునాని వైద్య కళాశాలలు స్థాపించాలని డాక్టర్ హుసైని, డాక్టర్ ముక్తియార్, రూట వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా కోరారు. ఈ విషయమై సోమవారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను తమ క్యాంపు కార్యాలయంలో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత యునాని వైద్య ఆరోగ్యశాఖ ప్రాముఖ్యత తగ్గుముఖం పట్టిందని దీనికి కారణం రాష్ట్రంలో ఒక్కటి కూడా ప్రభుత్వ యునాని వైద్య కళాశాల లేకపోవడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న యునాని వైద్యులు పోస్టుల భర్తీ చేయక పోవడమేనన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పదేళ్లు పూర్తయితే తెలంగాణ రాష్ట్రంలోని యునాని వైద్య కళాశాలల్లో ఏపీ కోట తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కడప జిల్లాకు యునాని రీసెర్చ్ సెంటర్ మంజూరు చేసి 25 ఎకరాల స్థలం కేటాయించినప్పటికి ఎలాంటి పురోగతి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యునాని ఆరోగ్య వైద్యశాఖకు జీవం పోయాల్సిన అవసరం ఉందన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు నాయకులు ఇస్హాక్ అలీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హైదర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కమలాపురం : అన్ని శాఖల మండలస్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం-3 సచివాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని తెలిపారు. ప్రజలకు ప్రతి అధికారి అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహాల నిర్మాణాలను వేగ వంతం చేయాలన్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి వసతులు కల్పించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అలాగే అర్హులుగా ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తహసీల్దార్ అలీఖాన్, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయకుమారి, షంషాద్ బేగం, పంచాయతీ సెక్రటరీ ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

వీరపునాయునిపల్లె : నేటి బాలలే రేపటి బావి భారత పౌరులని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల విద్యాశాఖ అధికారి జాఫర్ సాధిక్ ఆధ్వర్యంలో గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మంచి విద్యను అందించాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. నిరుపేద విద్యార్థులు కూడా ఇంగ్లీష్ మీడియం చదవాలన్న సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడుతో పాఠశాలల రూపు రేఖలు మార్చాడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకుని మంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మైనింగ్, సివిల్ సప్లై డైరెక్టర్లు వీరప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

గంగిరెడ్డిపల్లె లో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పక్కాగృహాలకు సంబంధించి ఇళ్ల పట్టాల సమస్యను సోమవారం ఆయన పరిష్కరించారు. వాటి నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు.

అర్హులైన ప్రతి రైతుకు పరికరాలు అందిస్తాం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి




ప్రజల సమస్యలను తెలుసుకుటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : అర్హులైన ప్రతి రైతుకు రాయితీతో వ్యవసాయ పరికరాలు అందజేస్తామని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సంగాలపల్లె గ్రామంలో గోశాల ప్రాంగణంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం ద్వారా రైతులకు మంజూరైన వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమన్నారు. రాయలసీమ ప్రాంతం కరువు ప్రాంతగంగా గుర్తింపు పడిందని ఈ ప్రాంతాన్ని సశ్యశ్యామలంగా మార్చాలన్న సంకల్పంతో ఎన్‌టీ రామారావు గాలేరు-నగరి సుజల స్రవంతి పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఆయన తరువాత పదవుల్లో కొనసాగిన ముఖ్యమంత్రులు ఈ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మళ్లీ ఈ పథకం పురుడు పోసుకొందన్నారు. అనంతరం గంగిరెడ్డిపల్లె, యరమలపల్లె, ఎస్.పాలగిరి రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ కళ్యాణి, మార్క్‌ఫెడ్ అధికారి విజయ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెల్లటూరు గ్రామ సచివాలయం పరిధిలోని వెల్లటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయాలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పింఛన్, రేషన్‌కార్డులు, విద్యుత్ సమస్య ఉందని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని సత్వరం వాటి సమస్యలను పరిష్కరించాలని అదేశించారు. కార్యక్రమంలో ఆగ్రోకార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్ మస్తాన్‌బి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, హుస్సేన్, సుదర్శన్‌రెడ్డి, గురివిరెడ్డి, విశ్వం, సుబ్బరాయుడు, నాగార్జునరెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్, ఉదయభాస్కర్‌రాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బిడ్డకు గాయం.. తల్లిడిల్లిన హృదయం



కడప సిటీ : లేగదూడకయిన గాయాన్ని చూసి ఆవు తల్లి తల్లడిల్లి పోయింది. వివరాల్లోకి వెళితే.. కడప నగరం వై జంక్షన్ నుంచి అప్సర సర్కిల్‌కు వెళ్లే రహదారిలో ఆవు, వారం వయస్సున్న దూడ రోడ్డుపై వెళుతుండగా వాహనమేదో దూడకు ఢీకొంది. దీంతో దూడ ముందరి కాలిగిట్టకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. అక్కడే ఉన్న తల్లి ఆవు .. దూడను చూస్తూ తల్లడిల్లి పోయింది. చాలా సేపటి దాకా ఎక్కడికీ కదలకుండా దూడనే చూస్తుండిపోయింది. ఆ ప్రాంతంలోని మెడికల్ షాపులో పని చేసే వ్యక్తి పక్కనే ఉన్న ఓ వైద్యునికి విషయం తెలియజేయడంతో ఆయన గాయం తగిలినచోట కట్టు కట్టి సపర్యలు చేశారు.

చంద్రబాబు రాయలసీమ ద్రోహి

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: రాయలసీమకు తీరని ద్రోహం చేసిన చంద్రబాబుకు ఈ ప్రాంత ప్రజల ఓట్లు అడిగే అర్హత లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యువ గళం పేరుతో పాదయాత్ర చేస్తున్న లోకేష్, రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించడం దారుణమన్నారు. పద్నాలుగేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు రాయలసీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయలేదని, చెప్పుకోదగ్గ ఏ ఒక్క ప్రాజెక్టును కూడా ఈ ప్రాంతానికి తీసుకురాలేదన్నారు. సీమలో ప్రాజెక్టులకు నీటిని తీసుకురావడానికి దివంగత వైఎస్సార్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచుతుంటే, దాన్ని అడ్డుకోవాలని బాబు ప్రయత్నించి ధర్నా చేయించాడని గుర్తు చేశారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రతిపాదిస్తే దాన్ని వ్యతిరేకించి, కోర్టుకు వెళ్లి స్టే తెచ్చిన ఘనత ఆ పార్టీకే దక్కుతుందని ధ్వజమెత్తారు. ఇప్పుడు రాయలసీమ డిక్లరేషన్ అంటూ సీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలనడం మోసపూరితమన్నారు. లోకేష్ పాదయాత్ర ఈవెనింగ్ వాక్‌లా ఉందని, ప్రజల నుంచి స్పందన లేక ముఖ్యమంత్రిపై, ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తూ ముందుకెళుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో రాయలసీమలో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకొంటుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరీం జిలానీ, ఫవాజ్ ఖాన్ పాల్గొన్నారు.

ఉనికిని కాపాడుకోవడానికి బీజేపీ తంటాలు



మాట్లాడుతున్న ఎం. చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉనికిని కాపాడుకోవడానికి బీజేపీ నానా తంటాలు పడుతోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రి అమిత్‌షా విమర్శలు చేయడం దారుణమన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచేలా అనేక నిర్ణయాలు తీసుకుంటోందని, ఒకప్పుడు రూ.400 ఉన్న గ్యాస్ ధర, నేడు రూ.1200కు పెరిగిందన్నారు. ఒకప్పుడు రూ.60 ఉన్న పెట్రోల్ రూ.110 అయ్యిందన్నారు. వీటి వల్ల అన్ని నిత్యావసర ధరలు భారీగా పెరిగాయన్నారు. బీజేపీ పాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం కష్టంగా మారిందని, కార్పొరేట్ సంస్థలకు బీజేపీ ప్రభుత్వ ఊడిగం చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఈనెల 16న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చలపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆయన తెలిపారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం

చెన్నూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల(హైస్కూల్ ప్లస్) నందు ప్రారంభించిన ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ తరగతులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రత్నాదేవి తెలిపారు. ఇందులో బైపీసీ, ఎంపీసీ తరగతులకు సంబంధించి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే మంచి విద్యా బోధన ఉంటుందని ఆమె తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను రూపు మాపాలి

కమలాపురం : బాల కార్మికులు లేని మండలంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజామణి తెలిపారు. సోమవారం ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ఐసీడీఎస్ సిబ్బంది, ఎంఎస్‌కేలతో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. బాలలను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం అన్నారు. హోటళ్లు, వెల్డింగ్ షాపులు తదితర దుకాణాల్లో బాలలను పనుల్లో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేస్తారన్నారు. ఎక్కడైనా 14 ఏళ్ల లోపు పిల్లలు పనుల్లో ఉంటే వారిని ఉచిత నిర్బంధ విద్య అందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వర్కర్లు, హెల్పర్లు, ఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ

చెన్నూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్య కానుక కిట్లను మండల ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీరల సురేష్‌యాదవ్ విద్యార్థులకు పంపిణీ చేసి మట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల బంగారు భవిష్యత్తు బాటవేశారన్నారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జి.ఎన్.భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ పాల్గొన్నారు.